క్లుప్తంగా

శ్రీనివాసుని ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాత

మునగపాక: మునగపాకలో నూతనంగా నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయానికి భక్తులు తమకు తోచిన విరాళాలు అందజేస్తున్నారు. రూ. 5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఆలయానికి మునగపాక గ్రామానికి చెందిన పట్నాల తులసీరావు బుధవారం రాత్రి రూ.5,016 నగదును కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మళ్ల సంజీవరావు, మొల్లేటి సత్యనారాయణ, బొడ్డేడ అప్పలనాయుడు, ఆడారి కాశీబాబు, దాడి పోలీసు తదితరులు పాల్గొన్నారు.

మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక

మునగపాక: గురువారం యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎంపికైంది. అధ్యక్షునిగా అంబటి నూతన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మాటూరి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ అత్యధిక మంది సభ్యులతో నడుస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఉత్తరాంధ్ర ఎంఎల్‌సీగా పోటీ చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీ విజయానికి కృషి చేయాలన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి జీఎస్ ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకటప్పారావు, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం

యలమంచిలి రూరల్: మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపుతుందని సీఐటీయు ప్రతినిధులు ఆవేదన వెలిబుచ్చారు. గురువారం యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ నేతృత్వంలో ప్రభుత్వ వైఖరి పట్ల నిరసన తెలిపారు. రాష్ట్రంలో కూడా కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలనే అనుసరిస్తోందని ఆరోపించారు. ఈ నెల 26న అనకాపల్లి నెహ్రూ చౌక్ వద్ద మహాధర్నా చేపడతామని చెప్పారు. ఇందుకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ ప్రతినిధులు చిరంజీవి, అప్పారావు పాల్గొన్నారు.

30వ రోజుకు చేరుకున్న భిక్ష సదుపాయం



భిక్ష స్వీకరిస్తున్న స్వాములు

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న భిక్ష సదుపాయం గురువారం నాటికి 30వ రోజుకు చేరుకుంది. అయ్యప్పమాల ధరించిన భక్తులతో పాటు ఇతర భక్తుల సౌకర్యార్థం మునగపాక అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు 41 రోజుల పాటు భిక్ష సదుపాయం కల్పించారు. పలు ప్రాంతాల నుంచి స్వాములు ఇక్కడికి వచ్చి భిక్ష స్వీకరిస్తున్నారు.

కూలీలు ముందుకొస్తే పనులు ప్రారంభిస్తాం

ఎస్.రాయవరం: పనులు చేసేందుకు కూలీలు ముందుకు వస్తే పనులు ప్రారంభిస్తామని ఎన్ఆర్‌జీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ శివ చెప్పారు. పి.ధర్మవరంలో ఇటీవల ఉపాధి పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇవ్వడంతో టెక్నికల్ అసిస్టెంట్ గ్రామంలో విచారణ చేపట్టారు. పనికి వచ్చేవారు వివరాలు ఇస్తే పనులు ప్రారంభిస్తామన్నారు. సీపీఎం పార్టీ జిల్లా నాయకులు ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు

ఎస్.రాయవరం: మండలంలో బీసీ బాలుర సంక్షేమ వసతి గృహ ప్రహరీ నిర్మాణానికి కొలతలు తీసుకుంటున్నట్లు సర్వశిక్షా అభియాన్ ఈఈ నరసింహారావు తెలిపారు. గురువారం వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ప్రహరీ నిర్మాణానికి కేటాయించే స్థలం కొలతలు తీసుకుని వెళ్లారు. ఈ పరిశీలనలో డీఈ గణేశ్వరరావు, ఏఈ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

గ్రామాలకు కాలుష్యం కాటు



గాలి, నీరు కలుషితమై విలవిల్లాడుతున్న కృష్ణంపాలెం, లాలం కోడూరు గ్రామాలు

- ఫార్మా పరిశ్రమల వ్యర్థాలతో ఇక్కట్లు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- తమను వేరే చోటుకు తరలించాలని వినతి



కృష్ణంపాలెం గ్రామాన్ని తరలించాలంటూ నిరసన తెలుపుతున్న గ్రామస్తులు (ఫైల్)

రాంబిల్లి (యలమంచిలి): పచ్చని పంట పొలాలతో కళకళలాడిన కృష్ణంపాలెం గ్రామం ఎస్ఈజెడ్, ఫార్మా పరిశ్రమల రాకతో కాలుష్య కోరల్లో కూరుకుపోయింది. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రభుత్వం నుంచి ప్రజల భూములకు ప్యాకేజీ వచ్చింది కాని నిర్వాసితులు ఇళ్లు నిర్మించుకోవడానికి సంవత్సరాలు గడుస్తున్నా ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదు. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లు ఎప్పుడు కూలిపోతాయోనని భయం భయంగా బతుకుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

18 ఏళ్ల నిరీక్షణ..

2006లో ఎస్ఈజెడ్ కోసం గ్రామంలో రైతుల నుంచి భూములు, ఇళ్లు తీసుకున్నారు. ఇప్పటికి 18 సంవత్సరాలు గడుస్తున్నా ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలాలు మంజూరు కాలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంచదార్ల పంచాయతీ భోగాపురం కొండ దగ్గర కృష్ణంపాలెం నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సర్వే పనులు చేపట్టింది. ఇంతలో ఎన్నికలు సమీపించడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. కృష్ణంపాలెంలో సుమారు 300 కటుంబాల నుంచి పరిశ్రమల కోసం ప్రభుత్వం భూములు తీసుకుంది. కానీ ఇప్పటి వరకు ఆ స్థలాల్లో ఎలాంటి పరిశ్రమలు రాలేదు. గ్రామ సమీపంలోనే ఫార్మా పరిశ్రమలు ఉండటంతో కాలుష్యంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పశువులను మేపుకోవడానికి పశుగ్రాసం కూడా దొరక్క ఇబ్బంది పడుతున్నారు. తమ గ్రామాన్ని తరలించి కాలుష్యం బారి నుంచి కాపాడాలని కృష్ణంపాలెం ప్రజలు కోరుతున్నారు.

విష వలయంలో లాలం కోడూరు గ్రామం

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండలం లాలంకోడూరు గ్రామ సమీపంలో ఉన్న ఎస్ఈజెడ్ ఫార్మా పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం వల్ల అనారోగ్యం బారిన పడతామని తెలియక ప్రజలు కారు చౌకగా భూములు ఇచ్చేశారు. ఇప్పుడు ఆ పరిశ్రమల నుంచి వచ్చే వాయు కాలుష్యం, నీటి కాలుష్యం కారణంగా గ్రామాన్ని విడిచిపెట్టే పరిస్థితి లాలంకోడూరు ప్రజలకు దాపురించింది. 2006లో ఎస్ఈజెడ్ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం లాలంకోడూరు గ్రామంలో భూములను సేకరించింది. దీంతో లాలంకోడూరు మినహాయించి పంటలు పండే వ్యవసాయ భూములు పోయాయి. ప్రస్తుతం లాలంకోడూరు గ్రామ సమీపంలో పలు ఫార్మా పరిశ్రమలు వచ్చాయి. వాటి ద్వారా నిత్యం విష వాయువులు పంట కాలువల్లోకి చేరి అవి కలుషితం అవుతున్నాయి. పొలాలకు స్వచ్ఛమైన నీరు లేక రైతులు పంటలు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. వాయు కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొంత మంది ఇప్పటికే గ్రామం విడిచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. తమ గ్రామాన్ని వేరే ప్రాంతానికి తరలించి పునరావాసం కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కాలుష్యం వల్ల పంటలు వేయలేదు..

లాలం కోడూరు గ్రామంలో పంట కాలువల్లోకి కంపెనీల వ్యర్థాలు చేరి నీరు కలుషితం అవుతున్నాయి. అందుకే పంట కూడా వేయలేదు. విపరీతంగా దోమలు పెరిగిపోయి వ్యాధులకు కారణమవుతున్నాయి. కంపెనీల నుండి దుర్గంధం వ్యాపిస్తోంది. ప్రభుత్వం స్పందించి లాలంకోడూరు గ్రామాన్ని వేరే చోటుకు తరలించాలి.

–లాలం అప్పారావు, లాలం కోడూరు గ్రామం



లాలం కోడూరు గ్రామ సమీపంలో కలుషితమైన పంట కాలువ

ఇళ్ల స్థలాలిచ్చి ఆదుకోవాలి..



ఎస్ఈజెడ్ పరిశ్రమ కోసం 2006లో భూములు, ఇళ్లు ప్రభుత్వం తీసుకుంది. భూములకు అరకొర ప్యాకేజీ ఇచ్చారు కానీ ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలాలు మంజూరు చేయలేదు. ఏళ్లు గడుస్తున్నా శిథిల భవనాల్లోనే నివసిస్తున్నాం. కొత్త ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలి. –రెడ్డి శంకర్రావు, కృష్ణంపాలెం గ్రామం

పునరావాసం కల్పించలేదు..



పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఇప్పటికీ పునరావాసం కల్పించలేదు. మా భూముల్లో పరిశ్రమలు రాలేదు. మాకు ఉపాధి దొరకలేదు. పరిశ్రమలు వస్తే ఉపాధి దొరుకుతుందని భూములు ఇచ్చాం. అవి ఇంకా ఖాళీగా ఉన్నాయి. వ్యవసాయం చేసుకోవడానికి భూములు లేక, ఉండటానికి సరైన ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. –రెడ్డి మారునాయుడు, కృష్ణంపాలెం గ్రామం

కాలుష్యంతో సమస్యలు..



పరిశ్రమల కోసం 2006లో ప్రభుత్వం రైతుల నుండి భూములు తీసుకుంది. అయితే ఇప్పటికీ ఆ భూముల్లో పరిశ్రమలు రాలేదు. వివిధ ఫార్మా పరిశ్రమల నుండి కాలుష్యం విపరీతంగా వచ్చి ప్రజలు అనారోగ్యం పాలువుతున్నారు. భూసేకరణ చట్టం ప్రకారం సేకరించిన భూముల్లో ఏడేళ్లలోగా పరిశ్రమలు రాకపోతే ఆ భూములను తిరిగి రైతులకు ఇచ్చేయాలి. – జి.దేముడునాయుడు, సీపీఎం మండల కార్యదర్శి

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలి

మునగపాక: ఇనాం భూముల వివరాలు అందించాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మునగపాక రెవెన్యూ కార్యాలయంలో గురువారం వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. మండలంలోని ఇనాం భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి, డీ-ఫారం పట్టాలు ఎంత మందికి అందజేశారనే వివరాలను కార్యాలయానికి అందించాలన్నారు. అలాగే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలన్నారు. డీటీ శేషుబాబుతో పాటు పలువురు వీఆర్వోలు సమావేశంలో పాల్గొన్నారు.

ఆయుష్ మిషన్ ప్రోగ్రాంపై ఆశ కార్యకర్తలకు శిక్షణ

పాయకరావుపేట: పట్టణంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం డాక్టర్ పి.పద్మావతి జాతీయ ఆయుష్ మిషన్ ప్రోగ్రాంపై ఆశ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీర్ఘకాలిక రోగాలు, వాటి నివారణ, చిరువ్యాధులకు ఆయుష్ చికిత్సపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వీఎస్ సౌందర్య, ఎంపీహెచ్‌ఈవో పీవీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనతోనే సన్మార్గం



సుర్లవానిపాలెంలోని అడవిరాజులబాబును దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జోగులు

కోటవురట్ల: ఆధ్యాత్మిక భావన సన్మార్గంలో నడిపిస్తుందని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పాములవాక శివారు సుర్లవానిపాలెంలో నూతనంగా నిర్మించిన అడవిరాజులబాబు ఆలయ ప్రారంభోత్సవంలో గురువారం ఆయన పాల్గొన్నారు. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాల సందర్శన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతత కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ



శ్రీను చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు

కోటవురట్ల: సుంకర శ్రీనివాస్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అన్ని వేళలా అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గొట్టివాడ గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు సుంకర శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దాంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు గురువారం పరామర్శించారు. శ్రీనివాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీనివాసు పార్టీ పటిష్టతకు అన్నివేళలా కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నక్కపల్లి ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి: ఆధార్ కార్డుల్లో తప్పొప్పులు సరి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. గురువారం ఆయన మండలంలో నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాల, సచివాలయం, రాజయ్యపేట, ఉద్దండపురం ఉపమాక, దోసలపాడు, గుల్లిపాడు, కాగిత, జానకయ్యపేట సచివాలయాల్లో ఈనెల 20 నుంచి 29 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఈ కేంద్రాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన సమారాధన



ఆదినారాయణను సన్మానిస్తున్న నాయకులు

నక్కపల్లి: న్యూఢిల్లీ కేంద్రంగా సేవలందిస్తున్న ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అమలాపురం సమీపంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సమీపంలో ఉన్న తోటల్లో ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. 1997 నుంచి ఆదిలీలా ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, పలు ప్రాజెక్టులు చేపట్టిందని వ్యవస్థాపకుడు ఆదినారాయణ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆదినారాయణను ఘనంగా సన్మానించారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణ బీజేపీ సమావేశాన్ని గురువారం పార్టీ టౌన్ అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వుడా రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం పార్టీ సభ్యత్వాల నమోదు ముమ్మరంగా సాగుతోందన్నారు. ఈ నెల 25లోపు సభ్యత్వ నమోదు పూర్తి చేసి, సంస్థాగత ఎన్నికలు నిర్వహించుకోవల్సి ఉందన్నారు. సమావేశంలో అసెంబ్లీ కో -కన్వీనర్ నక్కా శివ శంకర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టా దాసు బాబు, సీనియర్ నాయకులు పప్పు ఈశ్వరరావు, చరకం నాగేశ్వరరావు, జి. రామకష్ణరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మునగపాక: మండలంలోని వెంకటాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా టి.సిరసపల్లి, తోటాడ, గవర్ల అనకాపల్లి, వెంకటాపురం, మూలపేట, నారాయుడుపాలెం, రామారాయుడుపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

అచ్యుతాపురం సబ్‌స్టేషన్ పరిధిలో..

అచ్యుతాపురం: అచ్యుతాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని వెదురువాడ, దిబ్బపాలెం ఫీడర్లకు సంబంధించి చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం ఉన్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఆపరేషన్స్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. వెదురువాడ, జి.ధర్మవరం, ఎల్.ధర్మవరం, మట్ట ధర్మవరం, దిబ్బపాలెం, భోగాపురం, అచ్యుతాపురం, మోసయ్యపేట, మార్టూరు, జంగుళూరు, కుమారపురం, దుప్పుతూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాయకరావుపేట పరిధిలో..

పాయకరావుపేట: శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పాయకరావుపేట 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నందు గల 11 కేవీ పాయకరావుపేట ఫీడర్ కొన్ని ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా మంగవరం రోడ్డు, జగతా వారి వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, పాండురంగ స్వామి గుడి, మెయిన్‌రోడ్డు ప్రాంతాల వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


ప్రజాభిప్రాయ సేకరణ జరపాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, మత్స్యకారులు

అచ్యుతాపురం: పూడిమడకలో ఏర్పాటు చేయదలచిన ఎన్టీపీసీ విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు వాసుపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పూడిమడక తీరం వద్ద శ్రీనివాసరావు మాట్లాడారు. పూడిమడకలో ఎన్టీపీసీ ఏర్పాటు చేసి 4 వేల మందికి ఉపాధి కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చేపల శ్రీరాములు, ఉమ్మిడి జగన్, మేరుగు దానయ్య, ఎరిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరుని సన్నిధిలో సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఎస్.రాయవరం: శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం చతుర్థార్చన, యాగశాల అర్చన, హోమాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు పెద్ద ఎత్తున మహాలక్ష్మికి కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే శుక్రవారం సాయంత్రం దివ్య లీలా కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

రహదారి నిర్మించాలని ఆందోళన



గోవిందపాలెం జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి-వెంకటాపురం జంక్షన్ మధ్య ఉన్న నేవల్ బేస్ ప్రాజెక్ట్‌కు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడు నాయుడు డిమాండ్ చేశారు. గురువారం గోవిందపాలెం గ్రామంలో ప్రజా సంఘాలు, సీపీఎం, స్థానిక గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన జరిపారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ నేవీ రోడ్డు నిర్మాణం చేపట్టి, గోతులు పూడ్చాలన్నారు. గోతుల్లో వేసిన క్రషర్ బుగ్గి వల్ల విపరీతంగా దుమ్ము, ధూళి వ్యాపించి ప్రయాణికులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. అనంతరం రాంబిల్లి సీఐ సీహెచ్ నర్సింగరావు, నేవల్ బేస్ అధికారులు, ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులు వచ్చి రోడ్డు మీద దుమ్ము ధూళి వ్యాపించకుండా తడిపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పరిసర గ్రామ ప్రజలు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణతో ప్రమాదాల నివారణ



తుప్పల తొలగింపు పనులు జరుగుతున్న దృశ్యం

మునగపాక: పరవాడ రోడ్డును విస్తరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ అన్నారు. ప్రస్తుతం ఉన్న ఇరుకు రోడ్డు ద్వారా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారికి ఇరువైపులా పేరుకుపోతున్న తుప్పలను జేసీబీ సాయంతో గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారిని విస్తరించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు మద్దాల వీరునాయుడు తదితరులు ఉన్నారు.

తక్షణం పరిహారం అందజేయాలి



పూడిమడక తీరం వద్ద నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం: వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇవాల్సిన పరిహారాన్ని వెంటనే ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పూడిమడక తీరం వద్ద మత్స్యకారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చోడపల్లి అప్పారావు, చేపల తాతయ్యలు మాట్లాడుతూ ప్రైవేట్ పరిశ్రమల్లోనూ మత్స్యకార యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. బోట్లు, వలలు, సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని కోరారు. పూడిమడక ఫిషింగ్ హార్బర్‌ను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కర్రి అప్పారావు, ఆర్.రాము, తిక్కాడ నూకమ్మ, వాసుపల్లి కొమరం తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్య సేవలతో చక్కటి ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఆయుష్ వైద్యురాలు సుజాత, సిబ్బంది

ఎస్.రాయవరం: ఆయుష్ వైద్య సేవలతో సర్వరోగాలకు దూరంగా ఉండవచ్చని ఆయుష్ వైద్యులు ఆర్.సుజాత అన్నారు. సర్వసిద్ధి పీహెచ్‌సీలో గురువారం ఆయుష్ విభాగంపై ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా కఫ, వాత, పిత్త అనే మూడు తత్వాలు, సప్తధాతువులు, పంచ మహా భూతాల సమ్మేళనమే మన శరీరం అని చెప్పారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ అదనపు వైద్యులు వాసంతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన అయ్యప్ప అంబలం పూజ

మునగపాక: గురువారం రాత్రి ఏర్పాటు చేసిన అయ్యప్ప అంబలం పూజ అంబరాన్నంటింది. శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ నేతృత్వంలో నిర్వహించిన పూజకు విశేష స్పందన లభించింది. పలు ప్రాంతాలకు చెందిన గురుస్వాములు ఆలపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేదపండితులు వెలవలపల్లి కోటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబలం పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సెట్టింగ్ అందరినీ ఆకట్టుకుంది.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సత్తా చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

యలమంచిలి రూరల్: ఏయూ పరిధి అంతర్ కళాశాలల చెస్ పోటీల్లో యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి వెండి పతకాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో తమ విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చినట్టు చెప్పారు. పి.దుర్గా ప్రసాద్, వై. సింహాద్రి, వి. పవన్ దత్త, పి. కౌశిక్, జె.శ్రీను, టి.వాసు పోటీల్లో వెండి పతకాలు తీసుకొచ్చి యలమంచిలి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చారని చెప్పారు. వారిని, శిక్షణ ఇచ్చిన పీడీ వై. పోలిరెడ్డిని గురువారం ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. స్పోర్ట్స్ కమిటీ ప్రతినిధులు జగ్గారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.